


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

చిత్తూరు తిరుపతి

గురువారం 26 జూన్ 2025

పేజీలు 8




## పిజిఆర్ఎస్ పెండింగ్ వినతులపై దృష్టి సారించండి

**- మాదక ద్రవ్య దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ర్యాలీని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలి : తిరుపతి కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్**

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్ :** పిజిఆర్ఎస్ పెండింగ్ వినతులపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా, డివిజన్ మండల స్థాయి అధికారులతో డిఆర్ఓ నరసింహులుతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి

మిగతా 2లో

## 6 వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు : చిత్తూరు కలెక్టర్



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్న్యూస్:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5 వ తరగతి చదువుచున్న విద్యార్థినీ విద్యార్థుల కోసం మదనపల్లి మండలం వలసపల్లి లోని పి. యం. శ్రీ స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయలో 2026-27 విద్యాసంవత్సరానికి 6 వ తరగతిలో ప్రవేశానికి జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష 2026 కు ప్రకటన వెలువడినది. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేది 29-07-2025. ప్రవేశ పరీక్ష 13-12-2025న నిర్వహించబడుతుంది. ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు పూర్తిగా ఆన్ లైన్ ద్వారానే స్వీకరించబడును. అభ్యర్థులు ఆన్ లైన్ నమోదు 35 దర్శించగలరు. ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తులను మాత్రమే నవోదయ విద్యాలయ సమితి వారు అనుమతిస్తారు. ఇతర మార్గాలు, పద్ధతుల ద్వారా పంపిన దరఖాస్తులు స్వీకరించబడవు. విద్యార్థి, తల్లితండ్రుల నివాసం ఉమ్మడి చిత్తూరు జిల్లా అయి వుండవలెను. విద్యార్థినీ విద్యార్థులు 2025-26 విద్యాసంవత్సరంలో 5వ తరగతి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదువుతూ 01.05.2014 నుండి 31.07.2016 మధ్య జన్మించి వుండ వలెను. 3, 4 తరగతులు చదివిన పాఠశాలలు 5 వ తరగతి ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకొనే ముందు వెబ్ సైట్ లో ఇవ్వబడిన ప్రాస్పెక్ట్‌ను పూర్తిగా చదివి అర్థంచేసుకొనవలసినదిగా కోరడమైనది. ఆన్ లైన్ దరఖాస్తు చేసే సమయంలో సందేహ నివృత్తికై 1.8919956395, 9440945913, 80746305048 ఈ నంబర్లను సంప్రదించవచ్చునని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# జిల్లా విద్యాశాఖలో ఆయన ఓ కింగ్ మేకర్

**-20 ఏళ్ల పాటు ఒకే కార్యాలయంలో తిష్ట**

**- కింగ్ మేకర్ కను సైగల్లో లోనే విద్యాశాఖ పనులు**

**-చిన్న ఫైల్ అయిన అడిగిన కరెన్సీ ఇవ్వాల్సిందే**

**-మాటల వినకుంటే జిల్లా నుండి మాయం చేస్తా అని హుకుం**



**చిత్తూరుబ్యూరో మేజర్న్యూస్:** జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఓ చిన్నస్థాయి సీనియర్ అసిస్టెం ట్ ఉద్యోగి కింగ్ మేకర్గా మారి విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగే అన్ని పనులను తన చెప్పుడు చేతుల్లో పెట్టుకున్నాడు. సుమారు 20 సంవత్సరాలకు పైగా ఒకే కార్యాలయంలో తిష్ట వేసుకొని ఉండడంతో ఆ కింగ్ మేకర్ శాసించిందే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరగాలని లేనిపక్షంలో వ్యతిరేకించిన వారిని జిల్లా నుండి ఇతర జిల్లాకు మాయం చేస్తానని హుకుం జారీ చేస్తున్నాడు అని విమర్శలు. అంతేకాకుండా చిన్న ఫైల్ అయిన ఆయన వద్దకు తీసుకెళ్లి ఆయనకు ఎంతో కొంత సమర్పించుకోవాలి లేనిపక్షంలో ఆ ఫైలు ఏమాత్రం ముందుకు కదలకుండా బ్రేకులు వేసే సత్తా గలిగిన ఆ కింగ్ మేకర్ పేరు జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల్లో, కార్యాలయ సిబ్బందిలో, ఉపాధ్యాయులలో గుబులు పుట్టిస్తోంది. జిల్లా విద్యాశాఖ కార్యాల యంలో జరిగే ప్రైవేటు విద్య, ప్రభుత్వ విద్య పాఠశాలలకు సంబంధించి ప్రతి పనికి ఓ రేటును ఫిక్స్ చేసి ధరల పట్టిక ఉండే బోర్డు మినహా ఓ చుట్టాను విద్యాశాఖ కార్యాలయంలోని అన్ని విభాగాల లో తెలిసే విధంగా ప్రచారాన్ని చేస్తున్నాడని తెలిసింది. అలాగే ఉపాధ్యాయులకు సంబంధించి డెప్యూటేషన్లు అయినా ట్రాన్స్ఫర్లు అయిన పదోన్నతులు, ఇంక్రిమెంట్లు ఒకటేంటి అన్ని సెక్షన్లకు ఈ కింగ్ మేకరే కింగ్గా వ్యవహరిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారిని సైతం లెక్కచేయకుండా జిల్లా విద్యాశాఖను తన అక్రమార్జనకు అడ్డాగా మార్చుకున్నాడని గుసగుసలు వినిపిస్తున్నాయి.

జిల్లా స్థాయి అధికారి చెప్పిన ఏ పనులు కూడా ఈ కింగ్ మేకర్ పట్టించుకోకుండా రీజనల్ స్థాయిలో ఓ ఉన్నతా అధికారి అండతో తన ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తూ ఇబ్బడి మబ్బడిగా తన అక్రమార్జన పెంచుకొని కోట్ల రూపాయలకు పడగలెత్తాడని కూడా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రీజినల్ స్థాయిలో అతనికి అండగా ఉన్న ఆ అధికారి గతంలో ఇదే కార్యాలయంలో జిల్లాస్థాయి హోదాలో పనిచేయడంతో పాటు అప్పటినుండి ఇప్పటివరకు వారి మధ్య సంబంధాలు బలంగా ఉండడంతో ఇతగాడు సంపాదిస్తున్న అక్రమార్జనలో కొంత వాటాన్ని ఆ అధికారికి పంపుతున్నట్లు తద్వారా ఆ అధికారి జిల్లా విద్యాశాఖ సంబంధించి జరిగే పనులను ఈ కింగ్ మేకర్ తను సైగల్లోనే జరిగే విధంగా పరోక్ష సంకేతాలు పంపినట్లు కూడా తెలియ వచ్చింది. అంతేకాకుండా ఈ కింగ్ మేకర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కులాల వారిగా గ్రూపులను ఏర్పాటు చేస్తూ రాజకీయాలు చేస్తున్నాడనే విషయాలు సాక్షాత్తు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలిసిన అతని గురించి ప్రశ్నించే ధైర్యం లేకపోవడంతో అతగాడు ఆడిందానికి వత్తాసు పలుకుతూ వారి పనులు వారు చేసుకుపోతున్నారన్న రూమర్లు బలంగా

మిగతా 2లో

## గంజాయి సరఫరా చేసే వ్యక్తి అరెస్టు

**- రూ.32 వేలు విలువజేసే రెండు కిలోల గంజాయి, మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్ స్వాధీనం**

5 లో







## వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైయస్సార్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం వైయస్సార్ పార్టీ నాయకులుపై అక్రమ కేసులు. అభివృద్ధిపై వైయస్ జగన్మోహన్ రెడ్డితో చర్చించినట్లు తెలిపారు.

## ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయం భవన నిర్మాణంకుఅష్ట్ర. 25 లక్షల మంజూరు



**నగరి, మేజర్ న్యూస్:** నగరిలో ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయం భవన నిర్మాణం కు రు. 25 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నగరి డివిజన్ గ్రామీణ నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయం గత కొన్ని ఏండ్లుగా శిదిలావస్థకు చేరడంతో, ఆ విభాగం ఉద్యోగుల, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు నూతన భవన నిర్మాణం కు నిధులు మంజూరు చేయిస్తానని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ హామీ ఇచ్చారు.. ఇచ్చిన హామీ మేరకు రు. 25 లక్షలు జిల్లా పరిషత్ నిధులు మంజూరు చేయించారు.

## ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ శిక్షణ



**కోట, మేజర్‌న్యూస్:** యన్ సి సి 9 వ వార్షిక శిక్షణ శిబిరం యొక్క ఆరవ రోజు బుధవారం పర్మినెంట్ ఇన్స్ట్రక్టర్లు, అసోసియేట్ యన్ సీసీ ఆఫీసర్లు శారీరక శిక్షణ కవాతుతో ప్రారంభ మైంది. దీని తరువాత లైవ్ ఫైరింగ్ ప్రాక్టీస్, అకడమిక్ సెషన్లు జరిగాయి.ఐజీసీ క్యాడెట్లకు ప్రత్యేక తరగతులను లోకేష్ నిర్వహించారు, జనరల్ సబ్జెక్టులను పియల్‌లు, ఏయన్‌ఓలు కవర్ చేశారు. శిక్షణ కార్యకలాపాలను చీఫ్ ఇన్స్ట్రక్టర్. వైకుంఠం, క్యాంప్ అడ్జటెంట్ డాక్టర్ వి.ఎం. రెడ్డి నిశితంగా పర్యవేక్షించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి. విజయ కుమార్ రెడ్డి శిబిరాన్ని సందర్శించి ఫైరింగ్ రేంజ్, షిప్ మోడలింగ్ కార్యకలాపాలు, తరగతులు తీసుకోవడం వంటి వివిధ శిక్షణా కార్యకలాపాలను పరిశీలించారు. ఆయనతో పాటు క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ గణేష్ గౌడంగవే, క్యాంప్ అడ్జటెంట్ సబ్. లెఫ్టినెంట్ వి. మల్లికార్జునర్ రెడ్డి , సి.వి,నాగరాజు, పెంచలయ్య, లక్ష్మీనారాయణ, గోవిందు ఉన్నారు.సాయంత్రం, డాక్టర్. సౌజన్య ఆరోగ్యం, పరిశుభ్రత"పై ఇచ్చిన సమాచార ఉపన్యాసానికి క్యాడెట్లు హాజరయ్యారు. తరువాత, క్యాడెట్లు బాస్కెట్బాల్, ఖో-ఖో మ్యాచ్లతో సహా క్రీడా కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు.క్యాడెట్లు సాంస్కృతిక పోటీలో తమ ప్రతిభను ప్రదర్శించడంతో శిబిర వాతావరణానికి ఉత్సాహాన్నిచ్చింది.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట పెన్నిధి




**కుప్పం, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం నాడు పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఏపీఎస్ఆర్టీసీ సభ్యులు పి ఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్ బాబులు విచ్చేశారు. ఇందులో భాగంగా ఏడు మంది లబ్ధిదారులకు టిడిపి నాయకులు చెక్కులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట పెన్నిధి అని అన్నారు. పట్టణానికి చెందిన ఏడు వేరువేరు కుటుంబీకులు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందినట్టు తెలిపారు. వైద్యం కోసం అయిన ఖర్చు వల్ల వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమను ఆదుకోవాలంటూ ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ చేసుకున్నట్టు తెలిపారు. ఈ అర్జీలపై స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుమారు 12 లక్షల రూపాయలు చెక్కుల రూపంలో బాధితులకు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు సత్యేంద్ర శేఖర్, కాణిపాకం వెంకటేష్, ముత్తు, మహిళా నాయకురాలు తిరుమగల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నేడు అక్రమ మాదక ద్రవ్యాల వినియోగ దినోత్సవం



**వాకాడు, మేజర్ న్యూస్:** కలెక్టర్ ఆదేశానుసారం అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 26వ తేదీన మధ్యాహ్నం 3గంటల కు అందరూ మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయం సిబ్బంది, వెలుగు, అంగన్వాడీ సిబ్బంది అన్ని పాఠశాలల్లో 10వ, ఇంటర్ విద్యార్థులతో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించవలసిందిగా ఆదేశించడమైనదని వాకాడు ఎంపీడీఓ శ్రీనివాసులు కోరారు. మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా అందరిచే ప్రతిజ్ఞ చేయించాలి. విద్యార్థులతో మాట్లాడించాలని. పాఠశాల స్థాయితో పాటు ప్రతి మండల కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమంలో ఉపాధ్య సిబ్బంది, విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొనాలిని, మండల స్థాయిలో కూడా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫామ్ తో హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

## పిజిఆర్ఎస్ పెండింగ్ వినతులపై దృష్టి సారించండి

మొదటిపేజీ తరువాయి....

స్వీకరించిన అర్జీలలో పెండింగ్లో ఉన్న ఆర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపల అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ప్రతి అర్జీని ఆమూలాగ్రం పరిశీలించి నాణ్యతతో వారి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. సమస్యల పరిష్కారం పై అర్జీ దారుల నుండి నేరుగా ప్రభుత్వం ఫీడ్బ్యాక్ ను సేకరిస్తోందని ఈ అంశాన్ని ప్రతి ఒక్కరు గమనించి చిత్తశుద్ధితో అర్జీలను పరిష్కరించాలన్నారు. నేటి నుంచి రాష్ట్ర స్థాయిలో మాదక ద్రవ్య దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్నారన్నారు. జిల్లాలో కూడా జిల్లా, మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలను నిర్వహించాలన్నారు. ఇందుకోసం మున్సిపల్ కమిషనర్లు, మండల కేంద్ర ఎంపిడీవోలు స్థానిక ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. అలాగే జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలలో సంబంధిత ఎన్జీవోలను సైతం ర్యాలీలో భాగస్తులుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నేటి సాయంత్రం 04.30గంటల నుండి 05.30 గంటల వరకు నిర్వహించాలన్నారు. ఈ ర్యాలీలో పదవ,ఇంటర్మీడియట్, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. ఈ ర్యాలీలోమాదక ద్రవ్య దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక నినాదాలను చేస్తూ,ప్ల కార్డులను ఉపయోగిస్తూ నిర్వహించాలన్నారు. ఇందుకు సంబంధించి పోలీస్ ,ఎక్సైజ్ శాఖల వారు బ్యానర్లు, ఫ్లెక్సీలు ఇతర సామాగ్రిని సమకూరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్, డిఆర్డిఏ,ఎక్సైజ్, ఆరోగ్య శాఖల సిబ్బంది పాల్గొనాలన్నారు. అలాగే మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎస్సై, సీఐలు, సిడిపివోలు, వెలుగు సీసీలు, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు, ఎంఈఓ లు పాల్గొనాలన్నారు. ఈ ర్యాలీలో తప్పనిసరిగా పోలీస్ బ్యాండ్ ఉండాలన్నారు. ర్యాలీ అనంతరం సభ నిర్వహించి మాదకద్రవ్య దుర్వినియోగం అక్రమ రవాణా వల్ల కలిగే పర్యావసనాలు గురించి తెలియజెప్పి, కార్యక్రమంలో హాజరైన వారితో సంబంధిత ప్రతిజ్ఞను కూడా చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ లోని జిల్లా అధికారులు, జిల్లాలోని ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాశాఖలో ఆయన ఓ కింగ్ మేకర్

మొదటిపేజీ తరువాయి....

వినిపిస్తోంది. కుల బలం కలిగిన ఈ కింగ్ మేకర్ ఇదే కార్యాలయంలో సంవత్సరాలకొద్ది తిష్ట వేసుకోవడానికి మరో కారణం ఇతగాడు ఉద్యోగ సంఘాల్లో ఓ కీలక పదవిలో కొనసాగుతున్నట్లు తద్వారా అతని పదవీకాలం ముగిసిన ఆ సంఘానికి తన అక్రమ సంపాదనలో కొంత ధనాన్ని డొనేషన్ రూపంలో ఇచ్చి ఆ పదమని కాపాడుకుంటూ బదిలీ కాకుండా తన ఉద్యోగాన్ని ఒకే స్థానంలో భద్రంగా కాపాడుకుంటున్నాడన్న అనుమానాలు కూడా కొంతమంది వ్యక్తం పరుస్తున్నారు. సుమారు 20 సంవత్సరాలకు పైగా ఇదే కార్యాలయంలో తిష్ట వేసుకొని ఉన్న ఈ కింగ్ మేకర్ ఇప్పటివరకు పదిమంది ఉన్నతాధికారుల వద్ద పనిచేసిన అనుభవం ఉండడంతో జిల్లా విద్యాశాఖ పరిధిలో జరిగే ప్రతి పని ఇతనికి తెలిసి ఉండడంతో ఇతగాడు ఈ కార్యాలయంలో కింగ్ మేకర్ గా మారి తన ఆటలను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కింగ్ మేకర్ పై అనేక పర్యాయాలు జిల్లా కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లిన అక్కడ తన బలంతో ఏదో ఒకటి మాయ చేసి తన స్థానంలోనే కొనసాగుతున్నాడని అతనికున్న ఒక్క సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ స్థాయిని మరచి అన్ని సెక్షన్లకు తానే బాసుగా మెలగుతున్న ఈ కింగ్ మేకర్ గురించి మరిన్ని వివరాలు కొన్ని ఆధారాలతో నేటి దినపత్రిక పత్రిక సూర్య పాఠకుల ముందుకు తీసుకురానున్నది. జిల్లావ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో ఇతగాడి అనుచరులుగా ఉన్న కొంత మంది ఎం ఈ ఓ లు అక్రమంగా వసూలు చేస్తున్న వసూళ్ల గురించి కూడా నేటి దినపత్రిక మీ ముందుకు తీసుకురానున్నది.

## 2025 నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం

### -నవోదయ విద్యాలయాలకు ఎంపికైన 57 మంది విశ్వం విద్యార్థులు



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** జాతీయ స్థాయిలో 2025-2026 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో ప్రవేశానికై జరిగిన జవహర్ నవోదయ విద్యాలయప్రవేశ పరీక్ష 2వ జాబితా ఫలితాల్లో విశ్వం విద్యార్థులు బీ.సాత్విక మరియు ఎన్.ఝాన్సీ రెడ్డి ఎంపిక అయ్యారు.వీరితో పాటు ఎం.మహిదర్ రెడ్డి,ఎస్.హృతిక్ రాయల్, సలాడీ భువనేష్, ఎం.నిహాంత్ కుమార్, డి.మహిదర్, ఆర్.మనీషా, కే.ముని రూపేష్, ఏ.సంతోష్ పరాశర్,ఎన్.లాస్య చరిత, జే.పూర్ణ సాయి రెడ్డి,రామ్ తేజ, హరిత, లోకేశ్వరి, భావన, కావ్య, విక్రమ్, గోపిక, జీవన్ సాయి రెడ్డి,శరత్ చంద్ర,నవదీప్ యాదవ్, జాహ్నవి, జస్వంత్, మిథున్ మిహాల్, నితీష్ సాయి, సోహిని, అబ్యూదయి, సోహిత్ తదితరులతో పాటు మొత్తం 57 మంది విశ్వం విద్యార్థులు సీట్లు సాధించి ప్రభంజనం సృష్టించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్.విశ్వనాథ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగ ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను విశ్వం విద్యా సంస్థల అధినేత డాఎయన్. విశ్వనాథ రెడ్డి మరియు అకడమిక్ డైరెక్టర్ యన్.విశ్వ చందన్ రెడ్డి,కరస్పాండెంట్ యన్.తులసీ విశ్వనాథ్ లు విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ.. గత 35 సంవత్సరాలుగా జాతియ స్థాయిలొ జరిగే సైనిక్,నవోదయ,మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ ఇస్తూ,జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు మరియు ర్యాంకులను విశ్వం విద్యార్థులు సాదిస్తునట్ల తెలియచేశారు. 2026 నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల కోసం 8688888802 / 9399976999 ఫోన్ నెంబర్లను సంప్రదించగలరని తెలియజేశారు.

## తల్లంపాడులో పొలం పిలుస్తుంది : ఏఓ జ్యోతిర్మయి



**దొరవారిసత్రం, మేజర్‌న్యూస్ :** దొరవారిసత్రం మండలంలోని తల్లంపాడు, లింగంపాడు గ్రామాలలో జరిగినది.ఈ కార్యక్రమంలో మావిళ్లపాడు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కె శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారి ఏ జ్యోతిర్మయి ఏఈఓ గవాస్కర్ వెటర్నరీ స్టాఫ్ మరియు రైతులు పాల్గొన్నారు పాల్గొన్నారు.వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుతం హెయస్ వాక్సినేషన్ పశువులకి వేస్తున్నామని తెలిపారు.ఇంకెవరైనా వ్యాక్సినేషన్ పశువులకి వేపించకుండా ఉంటే వ్యాక్సిన్సే అందుబాటులో ఉన్నాయని పశువులు ఉన్న ప్రతి ఒక్కరూ వేయించాలని తెలిపారు.మండల వ్యవసాయ శాఖ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ వరి పంటల్లో ప్రస్తుతం మొముబిప్పి మరియు మైట్స్ గమనించడమైనది.మైట్స్ ఎక్కువగా ఉన్నచోట స్పిరోమెసెఫిన్ 22.9% ఎస్ సి 160 ఎం.ఎల్ ఒక ఎకరానికి వాడాలని తెలిపారు, మోముబిప్పికి కాటాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు వేసుకోవాలని తెలిపారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**తిరుపతి ఎడ్యుకేషన్,మేజర్ న్యూస్:** విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉన్నప్పుడే వారి భవిష్యత్తు ఉన్నత శిఖరాలకు వెళుతుందని మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ ఈ.కోనప్రభ తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ కాలనీ లోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉద్దేశించి కార్యక్రమ నిర్వాహకులు,మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసోసియేట్ డా: ఇ.కోన ప్రభ మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోందని. అవగాహనా లోపం, స్నేహితుల ప్రలోభాలు,చెడు స్నేహాలు, సరదా వంటి కారణాలతో చాలామంది యువత, విద్యార్థులు గంజాయి,డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు బానిసలవుతూ తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల వినియోగం వలన శారీరక మరియు మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా ఆర్థిక నష్టం, నేరప్రవృత్తి, గౌరవ నష్టం మొదలైన దుష్పరిణామాలు ఎదురవుతాయని ఆమె అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం పై ప్రతి ఒక్కరికీ సమగ్ర అవగాహన అవసరమని, మాదకద్రవ్యాల నిర్మూలనకై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఇ.కోన ప్రభ అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం యొక్క ప్రాముఖ్యత, థీమ్, మాదకద్రవ్యాల దుర్వినియోగానికి దారితీసే కారణాలు, వాటి ప్రభావాలు,మాదకద్రవ్యాల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలు మరియు ఎన్.డి.పి.ఎస్ చట్టం మొదలైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు, పౌర శాస్త్రం లెక్చరర్ సిఎన్.చెన్నా రెడ్డి,మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్స్ డా.ఎం. ఇంద్రాణి, ప్రీతి,పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.




## జిల్లా కలెక్టర్‌ని కలిసిన అర్బన్ తహసీల్దార్



**తిరుపతిరెవెన్యూ, మేజర్‌న్యూస్:** రేణిగుంట మండలం తాసిల్దార్‌గా ఉండి బదిలీపై ఇటీవల అర్బన్ మండలం తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన సురేష్ బాబు బుధవారంజిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్లు ను కలసిబొకే ఇచ్చి మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**గూడూరు, మేజర్‌న్యూస్:** అయ్యవారిపాళెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ సహకారంతో పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. బుధవారం ఉదయం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేగనూరు ఎంపిటిసి ఉమామహేశ్వరితెలుగుదేశం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అమరేంద్ర టిడిపి నాయకులు నారాయణరెడ్డి. రవీంద్ర రెడ్డి కృష్ణారెడ్డి శ్రీనివాసులురెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం కుమార్ ఉపాధ్యాయిలు శివకళ, చంద్రశేఖర్ ఎస్ఎంసి ఛైర్మెన్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పార్టీ అధ్యక్షుడిని ఘనంగా సన్మానించిన నాయకులు



**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** చిల్లకూరు మండల పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన దువ్వూరు రాజశేఖర్‌రెడ్డిని గ్రామ పార్టీ బాధ్యులు పెద్ద సంఖ్యలో సన్మానించారు. బుధవారం ఉదయం అధ్యక్షులు నివాసంలో కలసి పార్టీ నపాయకులు కార్యకర్తలుపెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాసరి శైలజ, చిట్టేటి శ్రీనివాసులు(కిరవాణి) పారిచర్ల పార్థసారథి, బల్లవోలుకు చెందిన దువ్వూరు వినయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, శివకుమార్, తిక్కవరం ఆయకట్టు సంఘం అధ్యక్షులు మందపాటి లింగారెడ్డి, తిక్కవరం సర్పంచ్ సతీష్‌రెడ్డి, ఉపసర్పంచ్ ప్రభాకర్‌యాదవ్, తిక్కవరం, యోగీశ్వరునిపల్లి, ఏరూరు పలు గ్రామాల నుంచి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## బీజేపీ నేత కేరళ రాష్ట్ర పార్టీ కో - ఇంచార్జి అపరాజిత సారంగికి స్వాగతం



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో పార్లమెంట్ సభ్యురాలు కేరళ రాష్ట్రానికి పార్టీ కో - ఇంచార్జీ అపరాజిత సారంగికి కోలా ఆనంద్ ఘనంగా స్వాగతం పలుకడం జరిగింది. దేశాన్ని చీకట్లోకి, నెట్టివేసిన ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా తిరుపతిలో జరగనున్న మేధావుల సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్లమెంట్ సభ్యురాలు బిజెపి కేరళ స్టేట్ కో - ఇంచార్జి అపరాజిత సారంగికి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్‌తో కలిసి ఆత్మీయ స్వాగతం తెలియజేశారు. శ్రీకాళహస్తి కలంకారి వస్త్రంతో సత్కరించి ఘనంగా స్వాగతం పలుకడం జరిగింది. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ డిసిసి అధ్యక్షులు సుధాకర్ జన్మదిన వేడుకలు



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని సరస్వతి కేఫ్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద బుధవారం ఉదయం మాజీ డిసిసి అధ్యక్షులు, బాస్ గౌరవ అధ్యక్షులు సుధాకర్ జన్మదిన వేడుకలు బలిజ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి బలిజ సంఘం సభ్యులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రూపేష్, కిరణ్, దైవప్రసాద్, డాక్టర్ జనార్ధన్, ఆకుల గజేంద్ర, పి జె సి బాబు, గాజుల చంద్ర,సోమశేఖర్ నాయుడు, జిల్లేడు అరుణ్,గోవర్ధన్, సుబ్బ నాగయ్య, రఘునాథ్, శ్రీధర్, శివకుమార్, మంజునాథ్, శంకరన్న, పుష్పాల వెంకటేశ్వర్లు, లక్ష్మీపతి, ఆర్టీసీ సుబ్రహ్మణ్యం, కోటి, చెంచు రెడ్డి, చంద్రన్న, గణేష్, ముని రాజా, నరేష్, సుదర్శన్ బాలాజీ, రమేష్, సిద్దయ్య, నరసింహులు, చిట్టి, జగదీష్, హేమగిరి, దొరస్వామి, హేమంత్,చెంగారెడ్డి, ప్రసాద్ రెడ్డి, తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అలిపిరి టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీలు



**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం తిరుపతి అలిపిరి టోల్‌గేట్ వద్ద ద్విచక్ర వాహ నదారులపై వాహన తనిఖీ చేశారు. వాహనదారుల వ్యక్తిగత భద్రతా దృష్ట్యా ఈ తనిఖీలు చేపట్టడం జరిగింది. తిరుమలకు వెళ్లే వాహనదారులు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలి. వర్షంలో వాహనం స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంది. ఈ తనిఖీలలో మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, అతికానాజ్, ఆంజనేయ వర్మ తిరుమల ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీహరి ప్రసాద్ వారి సిబ్బంది పాల్గొన్నారు. 85 మోటార్ వాహనాలపై హెల్మెట్ ధారణ చేయని కారణంగా వాహన తనిఖీ రసీదులు నమోదు చేసి రూ.80 వేల జరిమానా విధించినటుకల తిరుమల ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ తెలియజేశారు.

# ఆరోగ్యంగా ఉండడానికి కారణం కార్మికులే -జడ్జ్ లిఖిత

**పలమనేరు, మేజర్ న్యూస్:** మనం ఆరోగ్యంగా ఉండడానికి కారణం కార్మికులే అని జూనియర్ న్యాయమూర్తి లిఖిత పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మే డే సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె ఘనంగా మే డే ను కార్మికులతో జరుపుకున్నారు.మునిసిపల్ కార్మికులు ఉదయం 4 గంటలకే పరిశు భ్రతలో ఉన్న శ్రద్ధ చాలా గొప్పది అని కొనియాడారు. వాళ్ళ విధులతో పాటు హక్కులు కూడా తెలుసుకోవాలన్నారు. అలాగే వారికీ ఉన్న పాలసీల గురించి మునిసిపల్ కమీషనర్ రమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మనం తిరిగే స్థలము, పీల్చుకొనే గాలి ఇంత స్వచతందముగా మన యొక్క ఆరోగ్యాలు బాగుండడానికి కారణం మునిసిపల్ కార్మికులు అని వారి యొక్క సేవలను కొనియాడారు.సమావేశం అనంతరం కార్మికులతో కేక్ కట్ చేసి వారికి అల్పాహారం వడ్డించారు.పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యల్. భాస్కర్ మాట్లాడుతూ... యంత్రికయుగం రాకముందు మనిషి గంటల కొద్ది పనిచేసేవారు అదొక బానిస బతుకు అని తెలిపారు. 1886 మే 1న చాలా మంది కార్మికులు నాలుగు రోజులపాటు షికాగో లోని హే మార్కెట్ లో వేల మంది కార్మికులు పని గంటలు తగ్గించాలని పోరాటం చేశారు. ఈ పోరాటంలో చాలా మంది కార్మికులు పోలీస్ ల కాల్పులలో చనిపోయారు. తరువాత 1890 లో మే 1 న కార్మికులకు 8 గంటల పని వేళలను నిర్ధారించారు అని తెలిపారు.ఈ సమావేశం లో పలమనేరు మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మునిరాజా సీనియర్ న్యాయవాదులు లోకేష్, అరిపుల్ల ఖాన్, సయ్యద్ మొహిద్దీన్, మునిసిపల్ కమీషనర్ వెంకటరమణ రెడ్డి, మునిసిపల్ కార్మికులు, న్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఎమర్జెన్సీకి యాభై ఏళ్లు

**- బిజెపి నాయకులు నర్సింహులు అయూబ్ ఖాన్**

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను కదిలించిన ఎమర్జెన్సీ కి నేటితో 50 ఏళ్ళు నిండిపోయిందని బిజెపి సీనియర్ మైనారిటీ మోర్చా నాయకులు అయూబ్ ఖాన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు నరసింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు 1975 లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నెలలపాటు దేశంలో అత్యవసర స్థితిని విధించిందనిభారత దేశం పరాయి పాలన నుండి స్వేచ్ఛ స్వతంత్రం లోనికి వచ్చిన తర్వాత మన ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ రూపంలో తీవ్రమైన ముప్పు ఎదుర యింది నేటి తరానికి ఇది ఒక చిన్న అంశం మాత్రమే అనిపించవచ్చు కానీ ఆనాడు జరిగిన పర్యవసానాలు గురించి యువతరానికి తప్పక తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## జిల్లా పరిశ్రమల శాఖ జీఎంకు ఘన సన్మానం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జి.చంద్రశేఖర్ ను బుధవారం డిస్ట్రిక్ట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.వి చౌదరి తన సభ్యులతో వెళ్లి కలెక్టరేట్లోని జిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పుష్పగుచ్చంత ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కెవి. చౌదరి మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల అభివృద్ధికి తిరుపతి డిస్ట్రిక్ట్ చాంబర్ ఆఫ్ కామర్స్ తమ సహాయ సహకారాలను అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్సీఎం మేరకు ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు, ముఖ్యంగా ఎమ్మెస్ఎంఈల అభివృద్ధికి కావలసినటువంటి సహాయ సహకారాలు అందజేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో తిరుపతి డిస్ట్రిక్ట్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కె.రఘురామిరెడ్డి, పి.మధుసూదన్ రావు,హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## మా బడి మాకు కావాలి బాయ్ కట్ చేసిన విద్యార్థులు

**గూడూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని నెర్నూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల తరగతులను కుదిం చడంపై గ్రామస్తులు తమ పిల్లలతో కలిసి ఆందోళన నిర్వహించారు. బుధవారం ఉదయం నెన్నూరు గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను అప్ గ్రేడ్ చేయాల్సి ఉండగా ఇక్కడ 6,7,8, తరగతులను ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరువెంగనాయపల్లి పాఠశాలకు తరలించడంపై ఆందోళన వ్యక్తం చుశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, కె.వి.పి.ఎస్ అడపాల ప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్న పళంగా 47 మంది ఇక్కడ చదువుతున్న విద్యార్థులను ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరువెంగలాయపల్లి పాఠశాలకు మార్చడం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాలలు ప్రారంభమైన జూన్ 12వ తేదీ నుండి 15 రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఆయా గ్రామాలలోని విద్యార్థులు ఆ పాఠశాలకు వెళ్ళలేని పరిస్థితి ఉందన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎక్కడ చదువుతున్న వాళ్లని అక్కడే నిలుపుదల చేయాలని తల్లిదండ్రులు కె.వి.పి.ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్ మెంట్ చైర్మన్ దాసరి మోహన్, నాయకులు బి.వి.రమణయ్య, పామంజి మణి, ఆర్.శ్రీనివాసులు, ఏంబేటి చంద్రయ్య, కె.ధనమ్మ, ఎస్.నరసమ్మ, పి.లక్ష్మి దేవమ్మ, సిహెచ్ రమేష్, డి.మల్లికార్జున, దాసరి శీనయ్య, పల్లం రాజు, బి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఉచిత కిట్లు పంపిణీ

**కుప్పం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని మంకలదొడ్డి పంచాయతీ,ములకలపల్లి గ్రామంలో బుధవారం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు జె.ఎం.సీ మురళీ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని కొనియాడారు. సేవలోనే శ్రేష్ఠత విద్యలోనే వికాసం అనే విధానంతో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలపరిచి, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద విద్యార్థులకు విద్యాసంబంధిత అనేక సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో చిట్టిబాబు, టిడిపి నాయకులు కనకారాజు, నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అంకాల పరమేశ్వరి ఆలయంలో అమావాస్య పూజలు



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీ దైట్ సమీపంలో వెలసిన అంకాల పరమేశ్వరి ఆలయంలో బుధవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి అమావాస్య సందర్భంగా ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద రాహుకాలం పూజలు, కుంకుమార్చన నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు మహిళలు అర్చకులు జగదీష్ పాల్గొన్నారు.

## వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కుప్పం, మేజర్‌న్యూస్:** ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి పేర్కొన్నారు. కుప్పం మండలం, చెక్కునత్తం పంచాయతీ రైతు సేవా కేంద్రం వద్ద సబ్సిడీ వేరుశెనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి పయాజ్ భాష, రైతుల పొలంలో వేరుశెనగ పంటలను పరిశీలించి రైతులకు తగు సలహాలు,సూచనలు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ కోసం రైతుకు 50 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం సరఫరా చేస్తోందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్, నాయకులు కనకరాజు, బీరప్ప, నాగరాజు, రమేష్, బాలు, వెంకటాచలం, మాదేశ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

## త్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థుల ఎంపిక

**చౌడేపల్లి రూరల్, మేజర్‌న్యూస్:** ప్రతిష్టాత్మకంగా భావించే ట్రిబుల్ ఐటీకి చౌడేపల్లి మండలం పుదిపట్ల పంచాయితీ పుదిపట్ల ఉన్నత పాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పద్మజ తెలిపారు. పాఠశాలలో 10 తరగతి పాసై ఉత్తమ ప్రతిభ కనబరిచిన పూజిత, జశ్విత, మనోజ్ కుమార్‌లు ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు గ్రామస్తులు వారిని అభినందించారు.



## ఘనంగా మనోహర్ నాయుడు జన్మదిన వేడుకలు



**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గం పిఏ అయిన మనోహర్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా బొకే ఇచ్చి ఘనంగా ఆయనను సత్కరించిజన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

**చౌడేపల్లి రూరల్, మేజర్‌న్యూస్:** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ పుంగనూరు నందు ఉన్న కళాశాలలో అడ్మిషన్లకు డిప్లమా కోర్సులకు ఆన్లైన్ పద్ధతిలో విశ్వవిద్యాలయం వారు దరఖాస్తులను మే 28వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యు వెంకటేశ్వర్లు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు డిప్లమాలో ప్రవేశం కొరకు అర్హులు, కోర్స్ కాల వ్యవధి రెండు సంవత్సరములు మరిన్ని వివరాలకు 9493 253151, 90 10402068. సంప్రదించాలని తెలియజేశారు.



# అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో పనిచేసే ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచాలని కోరుతూ చేపట్టిన సమ్మె బుధవారానికి మూడవ రోజుకు చేరింది. ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్,టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామమూర్తి సూచనలు సలహాలు మేరకు అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శరవణ మాట్లాడుతూ గత ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు, అందర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులకు, డ్రైవర్లకు మాత్రమే జీతాలు పెంచిన విధంగానే ఇంజినీరింగ్ విభాగంలో రకరకాల పనులు చేసే కార్మికులకు కూడా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని హెచ్ఎర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె గురించి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు విన్న వించినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కార్మికులకు సమస్యలను పట్టించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులతో నేడు సీడీఎంఏ కార్యాలయాన్ని ముట్టడి స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శరవణ,ప్రధాన కార్యదర్శి డి.శివకుమార్ ,కోశాధికారి కే.ఆర్. శివప్రసాద్ గౌరవ సలహాదారు పి.వెంకటేష్,ఉపాధ్యక్షులు ఎం.హరికృష్ణ, ఎన్.వెంకటేష్,జాయింట్ సెక్రెటరీ టి.గోపాలాచారి,ఏ .ఉష యూనియన్ సభ్యులు కే.వీ.సునీల్ కుమార్, పి.శంకర్, ఎస్.పీరుల్లా, ఎం.వేలు, కే.సుజాత, వెంకటేష్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.





## రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి


**- అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర**

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్ :** నగరంలో హైరోడ్డు విస్తరణలో భాగంగా శనివారం కట్టమంచిలో రోడ్డుని ఆక్రమించుకుని నిర్మించిన భవనాలను, దుకాణాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ,ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సూచనల మేరకు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర ఆదేశాల మేరకు నగరం లోని ప్రధానమైన హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ మేరకు ప్రణాళిక విభాగం అధికారులు బుధవారం కట్టమంచి ప్రాంతంలో భవన ప్లాన్ అప్రూవల్ పొందేటప్పుడు చిత్తూరు నగరపాలక సంస్థకు రాసిచ్చిన స్థలమును, రోడ్డును ఆక్రమించుకున్న వాటిని అనాధికార బోర్డులను జెసిబి సహాయముతో తొలగించడం జరిగినది, ఈ కార్యక్రమంలో టీపి పీవోలు, ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

## రూరల్ మండల తహశీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు రూరల్ మండల తహశీల్దార్ జయప్రకాష్‌ను రూరల్ మండల టీడీపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా పుష్పగుచ్చం అందించి దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి రూరల్ మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగ కార్యదర్శి కె ఎస్ కాశీనాథ్, టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు కాటమరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు నాగభూషణం, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మేషక్, చిత్తూరు మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు తదితర నాయకులు పాల్గొన్నారు.





## మాజీ సీఎం జగన్ ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ

**పలమనేరు, మేజర్‌న్యూస్:** వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు, జిల్లా పార్టీ అధ్యక్షులతో పాటు, పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్లు హాజరైనారు. బాబు ష్యూరిటీ. మోసం గ్యారెంటీ'. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు. అమలు చేయకపోవడాన్ని ప్రజల్లో ఎండగడుతూ..'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో'..చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ..' పేరుతో వైయస్సార్‌సీపీ 5 వారాల బృహత్తర కార్యక్రమం. దీనికి సంబంధించి క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ చేశారు. ఇంటింటికీ దాన్ని చేర్చేల కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లి లోని తన క్యాంపు కార్యాలయంలో పలమనేరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఇంచార్జ్ వెంకటే గౌడ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

## మామిడి ధర పతనానికి గత వైసిపి ప్రభుత్వం అనుసరించిన విధానాలే కారణం

**- తెలుగుదేశం నేత జయచంద్ర నాయుడు**



**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ మామిడి రైతాంగం గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసిపి ప్రభుత్వం అమలు చేసిన విధానాలతో ఫ్యాక్టరీలు నష్టపోయాయి. కొన్నిచోట్ల నిర్వహణ భారంతో ఫ్యాక్టరీలు మూసి వేయాల్సిన దుస్థితి ఏర్పడింది.. దీంతో ఈ ఏడాది రైతులకు న్యాయమైన ధర ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిణామాలు నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది.. రైతులకు ఆదుకునే ప్రయత్నాలు మొదలు పెట్టింది ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కిలో తోతాపూరి మామిడికి 12 రూపాయలు గిట్టుబాటు ధర కల్పిస్తూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన చేశారు.. అందులో ఎనిమిది రూపాయలు జ్యూస్ ఫ్యాక్టరీలు చెల్లించే విధంగా నాలుగు రూపాయలకు ప్రభుత్వం చెల్లించే విధంగా తెలిపారు.. ప్రభుత్వం నాలుగు రూపాయలు భరించేందుకు ముందుకు వచ్చిన జ్యూస్ ఫ్యాక్టరీలు మాత్రం ప్రభుత్వం ప్రకటించిన ఎనిమిది రూపాయలు ఇచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నాయి.. గత ప్రభుత్వ నిర్వాకంతో తీవ్రంగా నష్టపోయామని ఫ్యాక్టరీ యాజమాన్యం అంటోంది.. దీంతో చాలాచోట్ల ఎనిమిది రూపాయలు ఇచ్చేందుకు ఫ్యాక్టరీలు ముందుకు రావడం లేదు.. అయితే ప్రభుత్వం మాత్రం రైతులను ఆదుకునే ఫ్యాక్టరీ యజమానులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు.. అందులో భాగంగా ఇప్పటికే ఇతర రాష్ట్రాలు నుంచి మామిడి ఏపీ ఫ్యాక్టరీలకు తరలించేందుకు నిషేధం విధించారు.. అలాగే పలుసార్లు మామిడి గుజ్జు పరిశ్రమతో జిల్లా కలెక్టర్లు సంప్రదింపులు జరుపుతున్నారు.. తద్వారా రైతులు నష్టపోకుండా ఆదుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.. ఇప్పటికే చాలా చోట్ల రైతులు ఫ్యాక్టరీలకు మామిడి తరలించారు.. మామిడి లోడ్లకు టోకెన్ల సిస్టం అమలు చేస్తున్నారని తొట్టంబేడు మండలం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వాడపల్లి జయచంద్ర నాయుడు తెలిపారు.

## ప్రజాస్వామ్యంలో చీకటి రోజు

**– బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు...**



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను కదిలించిన ఎమర్జెన్సీ విధించిన రోజుకు అప్పుడే 50 ఏళ్ళు నిండిపోయింది. 1975 లో అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 21 నెలలపాటు దేశంలో అత్యయిక స్థితిని విధించింది. భారత దేశం పరాయి పాలన నుండి స్వేచ్ఛ స్వతంత్రం లోనికి వచ్చిన తర్వాత మన ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ రూపంలో తీవ్రమైన ముప్పు ఎదురయింది. నేటి తరానికి ఇది ఒక చిన్న అంశం మాత్రమే అనిపించవచ్చు. కానీ ఆనాడు జరిగిన పర్యవసానాల గురించి యువతరానికి తప్పక తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పత్రికలపై సెన్సార్‌షిప్, రాజకీయ నాయకులు సంఘసంస్కర్తలు విద్యార్థులు మహిళల అరెస్టులు, బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు.. ఇలా ఎన్నో దురాగతాలు 21 నెలల్లో ప్రజలు చవిచూశారు. ఒక స్వార్థపూరిత నాయకురాలి నిరంకుశ మనస్తత్వం వల్ల భారత దేశపు ప్రజాస్వామ్యానికి తూట్లు పడింది. అందుకే జూన్ 25 వ తేదీని సంవిధాన్ హత్యా దివస్ గా పరిగణిస్తాం. 50 సంవత్సరాలు ముందు జరిగిన సంఘటనలను సరిదిద్దుకోలేని అంశాలను నేటి తరం తెలుసుకోవాలి. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు యువత పాటుపడాలని కోరుకుంటున్నా అని చిత్తూరు బిజెపి సీనియర్ నాయకులు చిట్టి బాబు కొల్లా తెలియజేశారు.

## పెద్దపంజాణి తహశీల్దార్‌గా హనుమంతు నాయక్



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** పెద్దపంజాణి మండల తహసీల్దార్‌గా హనుమంతు నాయక్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. చౌడేపల్లి తహసిల్దార్ పనిచేస్తూ బదిలీపై పెద్దపంజాణి కి వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవంతో మండలంలో రెవెన్యూ సమస్యలను గ్రామ రెవెన్యూ అధికారులతో కలిసి సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా తాహసి ల్దార్ తెలిపారు. పాఠశాల మరియు కాలేజి విద్యార్థులకు అవసరమైన కుల,ఆదాయ మొదలగు ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందించాలని, నిర్లక్ష్యం వహించవద్దని గ్రామ రెవెన్యూ అధికా రులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు అధికారులు మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కా రానికి సహకరించాలని సమస్య ఉంటే నేరుగా తెలియజేయవచ్చన్నారు. ఇదివరకు పెద్దపంజాణి తాహసిల్దారుగా పని చేసిన అనిల్ కుమార్ రెడ్డి డిప్యూటీ తహసీల్దారుగా పలమనేరుకు బదిలీఅయ్యారు. ఈ సందర్భంగా నూతన తహసిల్దార్ హనుమంతు నాయక్ ను అలాగే బదిలీ అయిన అనిల్ కుమార్ రెడ్డిని గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పుష్పగు చ్ఛాలు అందించి శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యుగేష్ రెడ్డి,రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్ కుమార్,గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం ఆచారి, వీఆర్వోలు క్రిష్ణంరాజు, సుజాత, తాహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



**కుప్పం,మేజర్ న్యూస్:** కుప్పం పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ పాఠశాల నందు బుధవారం విద్యార్ధి మిత్ర కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొత్తపేట ఇంచార్జి అప్పు (ముకేష్),కమిటీ అధ్యక్షురాలు రోజా మదన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వారు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వినూత్న పతకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా తల్లికి వందనం, విద్యా కిట్ల పంపిణీ పతకాలను అమలు చేయడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తల్లికి వందనం అమలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, విద్యా శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, 13వ కౌన్సిలర్ హంస సోమశేఖర్, 13,14 వార్డ్ అధ్యక్షులు మురళి, లోకేష్, సీనియర్ నాయకులు ఆన్సర్ బాషా, వరదరాజులు, మహేంద్ర, కృష్ణన్ నాటర్, తిరుమగళ్, టిఎన్ఎస్ఎఫ్ మునెప్ప,మోహన్, భరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణప్ప, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## శుభారాం డిగ్రీ కళాశాల రికార్డులను పరిశీలించిన ఆర్‌జెడి

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణ పరిధిలోని శుభారాం డిగ్రీ కళాశాలలో బుధవారం కడప



ఆర్‌జెడి నాగలిం గారెడ్డి రికార్డును పరిశీలించారు కళాశాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు అలాగే ఈనెల 30వ తేదీ కళా శాల ప్రిన్సిపల్ రాజశేఖర్ పదవి విరమణ చెందుతు న్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ర్యాలీని జయప్రదం చేయండి:ఎంపీడీవో



**చిట్టమూరు మేజర్‌న్యూస్ :** మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నేడు నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని చిట్టమూరు ఎంపీడీవో మనోహర్ గౌడ్ కోరారు. నేడు అంతర్జాతీయ మాదక దవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా నివారణ దినోత్సవాన ఉదయం 10 గంటలకు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు,సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఓ ప్రకటనలో తెలియజేశారు. చిట్టమూరు బస్ స్టేషన్ నుండి కొత్తగుంట కూడలి వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు కూడా ఎంపీడీవో మనోహర్ గౌడ్ ప్రకటనలో తెలిపారు.

# పార్టపల్లి వద్ద అండర్ పాస్ వంతెన నిర్మించండి

**– గ్రామస్తుల ఆందోళన**



**గూడూరు, మేజర్‌న్యూస్:** సాగరమాల రహదారి నిర్మాణంలో గ్రామస్తుల ఆందోళన పట్టించు కోకుండా గుత్తేదారు మేఘ సంస్థ ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. చిల్లకూరు మండలం ఉడతావారిపార్లపల్లి గ్రామం వద్ద వరగలి రహదారి నుంచి కృష్ణపట్నం పోర్టుకు నిర్మిస్తున్న సాగరమాల నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో ప్రజల సమస్యలు పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొణుకుమాల పంచాయతీ పరిధిలోని ఉడతావారిపార్లపల్లి యోగీశ్వరునిపల్లి గ్రామాలు ప్రస్తుతం ఒకటిగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. అయితే సాగరమాల రహదారి తమ పంచాయతీని రెండుగా చేస్తూ వంద మీటర్ల దూరాన్ని కాస్త ఐదు కిలో మీటర్లకు మారుస్తున్నారని ఆరోపించారు. మండల ప్రధాన రహదారిపై తిక్కవరం ఎస్‌టి కాలనీ వద్ద నిర్మిస్తున్న పై వంతెన వరకు సర్వీస్ రహదారిపై వెళ్లి తిరిగి తిక్కవరం వెళ్లాల్సి ఉంటుదని పేర్కొంటున్నారు. ఇలా కాకుండా మా గ్రామానికి అండర్ బ్రిడ్జి కావాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాగరమాల ప్రాజెక్టులో భాగంగా మేఘ కంపెనీ చేపడుతున్న నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. మేఘ కంపెనీ ప్రతినిధులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. అధికారులు పట్టించు కోవడం లేదని వంతెన నిర్మించే వరకు రహదారి పనులను అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. దీనికి తోడు వంతెన నిర్మించకపోతే ఉన్నత పాఠశాలకు ఐదు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి ఉంటుందని విద్యార్థులు ఇబ్బందులు పడతారని, ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వందల వామనాలు నిత్యం రద్దీగా తిరిగే 16వ నంబర్ జాతీయ రహదారిపైనే ప్రతి గ్రామం వద్ద సర్వీస్ రహదారులు నిర్మిస్తే ఇక్కడ మాత్రం ఎక్స్‌ప్రెస్ హైవే అంటూ సర్వీస్ రహదారులు ఏర్పాటు చేయక పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామల వద్ద అండర్ పాస్ వంతెనలు ఏర్పాటు చేయడంతోపాటు పొలాలకు వెళ్లే మార్గంలోనూ అండర్ పాస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అండర్ పాస్ వంతెన నిర్మించే వరకు ఆందోళన చేస్తామని తొణుకుమాల పంచాయతీ ప్రజలు పేర్కొన్నారు. ప్రజల ఆందోళన నేపథ్యంలో చిల్లకూరు మండలం తహసీల్దార్ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అండర్ పాస్ వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆందోళన కార్యక్రమంలో మండల బిసి సెల్ అధ్యక్షులు మేకల కుమార్‌యాదవ్, ఉసర్పంచ్ భాస్కర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం కుట్రలో భాగమే జగన్‌పై కేసు నమోదు



**చిట్టమూరు మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం కుట్రలో భాగంగానే మాజీ ముఖ్యమంత్రి జగన్ పై కేసు నమోదు చేశారని చిట్టమూరు మండలం గుణపాటి పాళెంకు చెందిన వైఎస్సార్సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వి సుబ్రహ్మణ్యం రెడ్డి చెప్పారు. బుధవారం మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గ రెంటపాలెం పర్యటన రోజు సింగయ్య ప్రైవేట్ వాహనం ఢీకొని ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు అదేరోజు ఎస్పీ ప్రకటించారన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డిని ఎ2గా కేసు నమోదు చేయడం కూటమి ప్రభుత్వం కుట్రలో భాగమేనని ఖండించారు. జగన్మోహన్ రెడ్డి కారు కింద పడ్డారని ట్రోల్ అవుతున్న వీడియోకు ముందు,తరువాత నిరూపించే వీడియో ఆధారాలులేవన్న ఆయన 3వేల కిలోల బుల్లెట్ ప్రూఫ్ వాహనం కింద పడితే వ్యక్తి నుజ్జు నుజ్జయ్యే ప్రమాదం ఉందన్నారు. తెదేపా అనుకూల,సోషల్ మీడియాలో ప్రచారం చేసి జగన్మోహన్ రెడ్డిని ఏ2గా కేసు నమోదు చేయడం దారుణమన్నారు. జగన్మోహన్ రెడ్డికి వస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక, ఎదుర్కొనే ధైర్యం లేక కూటమి ప్రభుత్వం కుట్రతో జైలుకు పంపి,రాజకీయాలకు, ప్రజలకు దూరం చేయాలని చూస్తోందన్నారు. జనాదరణ కలిగిన జగన్మోహన్ రెడ్డిని ఎంతగా ఇబ్బందులు పెట్టాలని చూస్తే ప్రతిఘటన తీవ్రంగా ఉంటుందన్నారు. రాజకీయాల లో గెలుపోటములు సహజమని కక్షపూరితంగా వ్యవహరించడం మంచి సంప్రదాయం కాదని హితవు పలికారు.

## రౌడీషీటర్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** రౌడీషీటర్ అచ్చి ప్రవీణ్ కుమార్(27) హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సిఐ కిషోర్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితుడు బండి సుబ్రహ్మణ్యంకి మృతుడికి మద్య ఉన్న గొడవల కారణంగా హత్య జరిగినట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ మృతుడు అచ్చి ప్రవీణ్ కారణంగా తనకు తన కుటుంబ సభ్యులకు ప్రమాదం ఉంటుందని భావించి కత్తితో పొడిచిన తర్వాత కూడ పారిపోతున్న అతడిని వెంబడించి గొంతు కోసి చంపినట్లు పేర్కొన్నారు. ఈ హత్య సంఘటనలో మరెవరి ప్రమేయమైనా ఉందన్న దానిపై విచారణలో నిర్ధారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సురేష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



**గూడూరు మేజర్‌న్యూస్:** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణం సౌకర్యవంతంగా మార్చు కోవాలని పట్టణ సిఐ శేఖర్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం ఒకటో పట్టణ సర్కిల్ కార్యాలయంలో పట్టణ, రూరల్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లను ఉద్దేశించి సిఐ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల సూచనలు మేరకు ట్రాఫిక్ ను ఒకటో పట్టణం నుండి రెండో పట్టణానికి వెళ్లే ఆటోలను ఒకటవ రైల్వే వంతెన నుండి రెండవ పట్టణానికి వెళ్లాలని, రెండవ పట్టణం నుండి వచ్చే ఆటోలు రెండవ రైల్వే వంతెన ద్వారా పట్టణంలోకి ప్రవేశించాలని అదేవిధంగా సాధుపేట నుండి వచ్చే ఆటోలు వాటర్ ట్యాంక్ మీదుగా పట్టణంలోకి రావచ్చని ఆటో డ్రైవర్లకు సూచించారు. రైల్వే స్టేషన్ నుండి సంఘం థియేటర్ వరకు రోడ్డు కిరువైపులా ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ఆటోలను నిలపాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో రెండవ పట్టణ సిఐ శ్రీనివాసరావు. పట్టణ ఎస్సై తిరుపతయ్య, సిబ్బంది ఉన్నారు.

## మహిళా ఆత్మహత్యాయత్నం



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని సింగిరిగుంట గ్రామానికి చెందిన సురేష్ భార్య వెంకటమ్మ కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్య యత్నానికి పాల్పడింది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్ చేస్తున్నారు దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అగ్రికల్చర్ డిప్లొమా దరఖాస్తు గడువు ఈనెల 30వరకు పొడిగింపు

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** చౌడేపల్లి మండల పరిధిలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 2025-26 విద్యా సంవత్సరానికి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులో ప్రవే శాలు పొందేందుకు దరఖాస్తు గడుపు ఈనెల 30 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యు . వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు వాస్తవానికి ఈ నెల 16తో ప్రవేశాల గడువు ముగిసిందని విద్యార్థుల సౌకర్యార్థం నెలా ఖరు వరకు గడువు పెంచినట్లు చెప్పారు. డిప్లొమా కోర్సుల్లో చేర డానికి ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదని పదోత రగతిలో పొందిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలియజేశారు.

## మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి కలిసిన
# రాష్ట్ర కార్యదర్శి పి.యన్.నాగరాజు

**వి.కోట మేజర్‌న్యూస్ :** చిత్తూరు జిల్లా వి.కోట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు, వై.యస్.ఆర్ సీపీ అధినేత వై.యస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్రకా ర్యాలయం నందు మర్యా దపూర్వకంగా కలిసిన రాష్ట్ర కార్యదర్శి పి.యన్. నాగరాజు కలిసి పార్టీ యొక్క స్థితిగతులను తెలియజేశారు. అదేవిధంగా పలమనేరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా నని కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండ గా ఉంటానని తెలియజేశారు.



# ప్రజల ఆరోగ్యం పట్ల ఆటలొద్దు... ఆరోగ్యకరమైన పండ్లను వాడి ఫల్పీలను తయారు చేయండి

**- ఫ్యాక్టరీలో పారిశుధ్యం పై మండిపడ్డ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** ప్రజల ఆరోగ్యం పై శ్రద్ధ వహించి ఆరోగ్యకరమైన ఫలాలను వినియోగించి పల్పీలను తయారు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సుధారాణి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు గుడిపాల మండలం సి కే పల్లి సమీపంలో గల టాసా మ్యాంగో పల్ప్ ఫ్యాక్టరీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఫ్యాక్టరీలోని అన్ని సెక్షన్లలో కలియ తిరిగి ఫ్యాక్టరీ యాజమాన్యం పై అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మ్యాంగో పల్పీల కోసం వాడుతున్న పరికరాలు అలాగే రసాయనాలను నాణ్యత పరంగా వాడడం లేదని నాసికరమైన వాటి ని వాడడం ద్వారా ప్రజల ఆరోగ్యం పాడవుతుందని నాణ్యమైన వాటిని వినియోగించాలని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ఆదేశించారు. అలాగే ఫ్యాక్టరీలో వెలువడే వ్యర్థమైన నీరు , వ్యర్థాలను ఫ్యాక్టరీ ఆవరణం బయట మళ్లించి ఎక్కడ గాని నిలువ కాకుండా ఉండే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని మరోసారి తాను తనిఖీ వచ్చినప్పుడు ఇలాంటివి మళ్లీ కనిపించిన ఉన్నట్లు తెలిసిన జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఫ్యాక్టరీ యాజమాన్యం పై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరికలు చేశారు. ప్రస్తుతం ఫ్యాక్టరీ నుండి వెలువడే వ్యర్థమైన నీటిని ఫ్యాక్టరీ బయట జన నివాసాల మధ్య నిలువ చేస్తున్నారని తద్వారా అక్కడ ధుర్లభమైన పరిస్థితులు ఏర్పడి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిలో అవకాశం ఉందని తక్షణం దానిని తొలగించి ఆ వ్యర్థమైన నీటిని అనుకూలమైన ప్రాంతాలలో వెళ్లే విధంగా చూడాలని ఆమె పేర్కొన్నారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుల కు తరచూ వైద్య చికిత్సలను అందించాలని తరచూ వారి ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని మీ సనిమీప ప్రాంతంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు అలాగే ప్రస్తుత పరిస్థితి ఫ్యాక్టరీ నందు అనారోగ్యకరంగా ఉందని కార్మికులు వినియోగించే మరుగుదొడ్లు అద్వానంగా ఉందని దుర్గంధం వ్యాపిస్తుందని తక్షణం పిచ్కారి చేయించి మంచి వాతావరనాన్ని కల్పించాలని ఈ సందర్భంగా ఆమె ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంట జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్, గుడిపాల మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనూష, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మోహన్ శెట్టి, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, వాణి తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల30 నుండి జూలై 02వ తేదీ వరకు శ్రీ కళ్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకళ్యాణ వేంకటే శ్వర స్వామి ఆలయంలో జూన్ 30 నుండి జూలై 02వ తేదీ వరకు శ్రీవారి సాక్షాత్కార వైభవోత్సవములు జరుగనున్నాయి. ఈ సందర్భంగా జూన్ 26న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. జూలై 03న పార్వేట ఉత్సవం నిర్వహిస్తారు.జూన్ 26న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సందర్భంగా తెల్లవారు జామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేసి మధ్యాహ్నం 12.30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా జూన్ 30వ తేదీన ఉదయం 11 - 12 గం.ల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 5 - 6 గం.ల



మధ్య ఊంజల్ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7గం.ల పెద్దశేష వాహనంపై శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి మాడ వీధుల్లో విహరిస్తారు. జూలై 01వ తేదీన ఉదయం 11 - 12 గం.ల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 - 6 గం.ల మధ్య ఊంజల్ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7గం.ల హనుమంత వాహనంపై శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారినిఊరేగిస్తారు. జూలై 02వ తేదీన స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవ అనంతరం, సాయంత్రం 6.30 - 07.00 గం.ల మధ్య లక్ష్మీ హారాన్ని ఆలయ ప్రదక్షిణగా అలంకార మండపంలోకి తీసుకువచ్చిరాత్రి 7 గం.ల గరుడ వాహనము పై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు.జూలై 3న పార్వేట ఉత్సవం, ఉదయం తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం,సహస్రనామార్చన, శాత్తుమొర, అనంతరం ఉత్సవ మూర్తులు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అనంతరంఉదయం 11 గంటల నుండి 2 గం.ల మధ్య పార్వేట ఉత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ఆస్థానం, వైదిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.సాక్షాత్కార వైభవోత్సవం, పార్వేట ఉత్సవం సందర్భంగా జూన్ 26న, జూన్ 30 నుండి జూలై 03వ తేది వరకు నిత్య కళ్యాణోత్సవం రద్దు చేశారు. జూన్ 26 నుండి జూలై 03 వరకు తిరుప్పావడ సేవ, జూలై 02న అష్టోత్తర శతకలశాభిషేకం సేవలు రద్దు చేశారు. జూలై 01వ తేదీన స్వర్ణపుష్పార్చన రద్దు చేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

**- డిఐఈఓ డాక్టర్ శ్రీనివాసులు**

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వ కళాశాలలో చర్యలు చేపట్టడం జరుగుతోందని డిఐఈఓ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఎన్ ఆర్ పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వ అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ కళాశాల బలోపేతానికి కళాశాల లెక్చరర్లు కృషి చేయాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా ఇప్పటినుంచి ప్రణాళిక లు సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరి రక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ధనంజయ, లెక్చరర్ శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.






## కనకదుర్గాదేవి దేవస్థానంలో
# ఆషాడ గుప్త శ్రీ వారాహి నవరాత్రులు

**పలమనేరు, మేజర్‌న్యూస్:** శ్రీశ్రీశ్రీ కనకదుర్గాదేవి దేవస్థానంలో గురువారం ఆషాడ శుద్ధ పాడ్యమి 26/6/25 నుండి జూలై 4వ తేదీ శుక్రవారం నవమి వరకు అతి ప్రాశస్తమైన ఆషాడ గుప్త శ్రీ వారాహి నవరాత్రులు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి మంగళ,శుక్రవారాలలో రాహు కాల పూజలు,అభిషేకాలు, ప్రతి అమావాస్య రోజున ప్రత్యేక పూజలు దుర్గా హెూమం, కుంకుమార్చనలు, పౌర్ణమి లలితా సహస్రనామ హెూమం, పారాయణంతో పాటు,ప్రసాద వితరణ నిర్వహించ`నున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు కరపత్రంలో తెలిపిన ఫోన్ నంబర్ ను సంప్రదించాలని, స్వచ్ఛంద గా విరాళాల ఇచ్చే వారు 8919625554 ఫోన్ పే ద్వారా చెల్లించవచ్చని శ్రీ కనకదుర్గాదేవి దేవస్థాన కమిటీ సభ్యులు కె.వి. రమణ, సి.పి ప్రకాష్, కే.ఎం నాగరాజు, యువరాజు తెలిపారు.




జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116